
క్లుప్తంగా

ఖైదీలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



జనగామ రూరల్: ఖైదీలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ డిఫెన్స్ న్యాయవాది మంచాల రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును డిఫెన్స్ న్యాయవాదులు సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రవీందర్ మాట్లాడుతూ.. ఖైదీలు బాధ్యత, నిబద్ధత, క్రమశిక్షణతో ఉండాలని, ఎవరికైనా న్యాయ సలహాలు, సహాయం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది రాగల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 109 మంది గైర్హాజరు



జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 109 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 1,690 మంది విద్యార్థులకు 1,581 మంది హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ బైరి శ్రీనివాస్ తెలిపారు. జనగామ పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్, కొడకండ్ల, దేవరుప్పుల, బచ్చన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్ కళాశాలలను శ్రీనివాస్‌తో పాటు డెక్ సభ్యులు సందర్శించారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



చిల్పూరు: చిల్పూరు శ్రీబుగులు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 3న నిర్వహించే స్వామి వారి కల్యాణానికి రావాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు ఆదివారం ఆహ్వాన పత్రం అందజేశారు. అలాగే కలెక్టర్ శివలింగయ్య, జేసీ ప్రఫుల్ దేశాయ్‌లకు చైర్మన్, ఈఓ, అర్చకులు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

టిప్పర్, బైక్ ఢీ..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల ఆర్చి వద్ద ఆదివారం టిప్పర్ వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో భిక్షపతి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పీచరకు చెందిన భిక్షపతి వ్యక్తిగత పనులపై చిన్నపెండ్యాల మీదుగా స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నపెండ్యాల నుంచి కాజీపేటకు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో భిక్షపతి కాలుకు గాయాలు కాగా 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వినయ్‌కుమార్ పరిశీలించారు. టిప్పర్ డ్రైవర్‌పై శివరాత్రి జంపయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొడుక్కి తలకొరివి పెట్టిన తల్లి



స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణంగా తల్లిగాని, తండ్రిగాని మృతిచెందితే కుమారుడు తలకొరివి పెడతాడు. అయితే అనారోగ్యంతో కుమారుడు చనిపోగా తనయుడికి ఆ తల్లి తలకొరివి పెట్టిన సంఘటన మండలంలోని శివునిపల్లిలో ఆదివారం జరిగింది. మండలంలోని శివునిపల్లికి చెందిన బూర్ల రాజు(34) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందగా అతని దహనసంస్కారాలు ఆదివారం నిర్వహించారు. రాజు తండ్రి గతంలోనే మృతిచెందగా తల్లి ఎల్లమ్మ వ్యవసాయ కూలీగా పనిచేస్తుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా పెద్దకుమారుడు రాజు అనారోగ్యంతో మృతిచెందగా తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుమారుడి అంతిమ సంస్కారాలకు తల్లి విలపిస్తూ తలకొరివి పెట్టింది.

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం 1.30 గంటల సమయంలో రైలు నుంచి సుమారు 30 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై కె.అశోక్ కుమార్ తెలిపారు. మృతుడు తెల్లటి షర్ట్ ధరించి ఉన్నాడని, జనగామ జీఆర్పీ సిబ్బంది బి.సుదర్శన్, సీహెచ్ నరేష్‌లు ..మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించి భద్రపరిచారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకి తెలిసినవారు 9440700037 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రఘునాథపల్లి: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



దేవరుప్పుల హైస్కూల్‌లో..

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1986–87 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య స్నేహితులు మళ్లీ కలుసుకున్నారు. మూడున్నర దశాబ్దాల తర్వాత పలు జిల్లాల్లో ఉన్న బాల్య స్నేహితులు అదే పాఠశాలకు ఆదివారం చేరుకొని సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువులు ఆర్.వెంకటయ్య, భాస్కర్, బద్రుద్దీన్, గులాం సందానిలను సన్మానించారు. సర్పంచ్ బిర్రు లక్ష్మీనర్సింహులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..



బచ్చన్నపేట పాఠశాలలో...

బచ్చన్నపేట: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94, పోచన్నపేట పాఠశాలకు చెందిన 2003–04 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

సమాజహితం కోసం పాటుపడాలి

దేవరుప్పుల: అనేక రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సమాజ హితం కోసం పాటుపడాలని ఇన్‌చార్జ్ ఎంజీఓ అప్పిడి చంద్రారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌కు చెందిన 1990–91 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో..

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ పరిధిలోని బీఈడీ కళాశాలలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను శాలువాలతో సత్కరించారు. గురువులు దుర్గాప్రసాద్, పద్మశ్రీ, శ్రీహరి, రవీందర్, వినోద్, రమణ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రైతులు

చిల్పూరు: రైతులు సాగునీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యకు నేడు(సోమవారం) మంత్రి కేటీఆర్ పరిష్కారం చూపుతుండడం తమ అదృష్టమని సర్పంచ్ లోడెం రజితరవీందర్, ఎంపీటీసీ మారబోయిన ఐలమ్మ అన్నారు. ఈ మేరకు కొండాపూర్‌లో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండాపూర్, లింగంపల్లి, శ్రీపతిపల్లి గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి సర్కారు హామీ ఇచ్చింది. అందులో భాగంగా నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. ఉప సర్పంచ్ కొడ సంపత్, ఎల్లయ్య, నాయకులు కొండ రాజు, మోతె కిష్టయ్య, డాక్టర్ ప్రకాష్, లోడెం అశోక్, కొండ తిరుపతి, పులికాశి రాజయ్య, నర్సయ్య, సురేష్, కిష్టయ్య, కనుకయ్య, రాజయ్య పాల్గొన్నారు.

‘విభజన’ హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

జనగామ రూరల్: రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవన్‌లో ఆది సాయన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలోని తెలంగాణకు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యునివర్సిటీ వంటి హామీలను కేంద్రం విస్మరించిందన్నారు. చట్టాల అమలుకు ఈనెల ఉమ్మడి వరంగల్‌లో ప్రజా చైతన్య పోరాట యాత్రలు నిర్వహిస్తున్నామని అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై వత్తిడి తెచ్చి హామీలు అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఇండ్ల స్థలాలు, పోడు భూములకు పట్టాలు, జనగామ–హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు జనార్దన్, సుగుణ, సోమయ్య, సదానందం, యాదగిరి రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మ్యాథ్స్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

దేవరుప్పుల: విశ్వం ఎడ్యూటెక్ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన జోనల్ లెవెల్ అబాకస్–వేదిక్ మ్యాథ్స్ టెస్ట్‌లో మండల కేంద్రానికి చెందిన శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ విద్యార్థులు మూడు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రం సెయింట్‌మారియా హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో యాదాద్రి, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 12 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో ఇ.అఖిలేశ్(5వ తరగతి) మొదటి ర్యాంకు, జూనియర్స్ విభాగంలో ఒ.ఈశ్వరి(4వ తరగతి) రెండో ర్యాంకు, స్టార్ జూనియర్స్ విభాగంలో శివ(2వ తరగతి) మూడో ర్యాంకు పొందగా.. వారిని పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న అభినందించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి 8.30 గంటలకు తొళక్కం పూజతో అర్చకుల వేద మంత్రాల నడుమ మొదలయ్యాయి. వేడుకలను చైర్మన్ శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతులు ప్రారంచారు. కార్యక్రమంలో అర్చకులు, ఈఓ వెంకట్రావు, ఉప సర్పంచ్ పిట్టల మహేందర్ సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు.

రచనల్లో సామాజిక స్పృహ ఉండాలి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న రమేష్

జనగామ రూరల్: పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేవారు కవులు.. నేటి తరం కవుల రచనలు ప్రజల మనోభావాలు, సామాజిక స్పృహను కలిగి ఉండాలని కందాళ రమేష్ అన్నారు. దివంగత కవయిత్రులు కందాళ శోభారాణి, బైరి ఇందిర సంస్మరణ సభను జంగ వీరయ్య అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాలు అన్ని రంగాల్లో ఎదగాలి.. ఇందుకు వారికి కావలసిన చైతన్యం అందించేందుకు కృషి చేయాలని చెప్పారు. దివంగత కవుల ఆశయాలకు అనుగుణంగా కవితలు రావాలని సూచించారు. కార్యక్రమంలో కవులు కోడెం కుమారస్వామి, సాంబరాజు యాదగిరి, జి.కృష్ణ, పానుగంటి రాంమ్మూర్తి, సోమేశ్వరాచారి, సదానందం, కొట్టె శ్రీలత, అంజయ్య, మురళి, జగదీశ్వరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన బూర్ల రాజు(34) అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఆదివారం వేర్వేరుగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రాజు శివునిపల్లి ఎస్‌బీఐలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల అనారోగ్యానికి గురికాగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కడియం శ్రీహరి, డాక్టర్ రాజయ్య తదితరులు ఆదివారం గ్రామంలో రాజు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపి బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, నాయకులు ఉన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి



కొడకండ్ల: మండలంలోని నర్సింగాపురం గ్రామ సమస్యలపై సర్పంచ్ దండెంపల్లి శ్రీలత ఆధ్వర్యంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. దళితులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, విద్యుత్ స్తంభాలు, చౌటకుంట మరమ్మతు కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. దళిత కమ్యూనిటీ హాల్‌కు రూ. 15 లక్షలు మంజూరు చేసిన మంత్రి మిగతా పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ ఉన్నారు.

నివాళి



జగన్నాథరావు (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది తొలి సర్పంచ్ పొట్లపల్లి జగన్నాథరావు (92) అనారోగ్యంతో శనివారం హనుమకొండలో మృతిచెందారు. విషయం తెలుసుకుని ఆదివారం సర్పంచ్ కొయ్యడ మల్లేష్, మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ డి.సత్తయ్య, చెంచు రమేష్ తదితరులు ఆదివారం హనుమకొండకు చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేష్ మాట్లాడుతూ జగన్నాథరావు మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, యాదగిరిపాల్గొన్నారు.

నేడు బాబుమోహన్ రాక

దేవరుప్పుల: ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు, సినీ హాస్యనటుడు బాబుమోహన్ నేడు (సోమవారం) సాయంత్రం 4 గంటలకు రానున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు దుబ్బ రాజశేఖర్, చింత సృజన్,బాగాల నవీన్‌రెడ్డి ఉన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయండి



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య



స్వాగత బెలూన్

జఫర్‌గఢ్: నేడు(సోమవారం) వేలేరు మండల కేంద్రంలో నిర్వహించనున్న కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కోరారు. బహిరంగ సభకు జన సమీకరణ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు మండలంలోని కూనూర్‌లో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించి మాట్లాడారు. మండల అధ్యక్షుడు జైపల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ ఎంపీపీ కనకయ్య, సర్పంచ్ కుమార్ పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు భారీగా తరలాలి

చిల్పూరు: నేడు వేలేరు మండలంలో నిర్వహించే మంత్రి కేటీఆర్ సభలో రాజవరం గ్రామం నుంచి భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజవరంలో ఆదివారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు యాకూబ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భారీగా జనాన్ని తరలించేందుకు కులాల వారిగా కమిటీలను వేశారు.

రఘునాథపల్లి: వెలేరు మండలం సోడాషపల్లిలో నిర్వహించే బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ నాగుర్ల వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ బొల్లం అజయ్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు భారీ స్వాగత బెలూన్

జనగామ రూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సోమవారం వేలేరు పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఆయనకు స్వాగతం పలికేందుకు ఆదివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలో కేటీఆర్ ఫొటోతో భారీ బెలూన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంతోపాటు ఎన్‌హెచ్‌పై వెళ్లే వారికి కనిపించేలా ఉండడంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



వ్యవసాయ పనిముట్ల కేంద్రం ప్రారంభోత్సవంలో ఇర్రి రమణారెడ్డి, భాగ్యలక్ష్మి

బచ్చన్నపేట: మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయంప్రతిపత్తి సాధిస్తే కుటుంబంతోపాటు సమాజం అభివృద్ధి చెందుతుందని రైతు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అంజయ్య అన్నారు. మండలంలోని పోచన్నపేటలో ఆంజనేయ గ్రామైఖ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో రూ. 17.50 లక్షలతో ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్లను అద్దెకిచ్చే కేంద్రాన్ని సర్పంచ్ మంజుల మల్లేషంతో కలిసి ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ట్రాక్టర్, రోటివేటర్స్, కల్టివేటర్, పిచికారీ స్ప్రేలు, తదితర వ్యవసాయ పనిముట్లను రైతులకు అద్దెకివ్వడం ద్వారా రైతులకు ఉపయోగం సంఘాలవారికి లబ్ధిచేకూరనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణంరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దూడల కనకయ్య, ఏపీఎం మురహరి, ఎంపీటీసీ మామిడి అరుణ, ఐలయ్య, ఉపసర్పంచ్, జాల కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ బాలచందర్, గ్రామ రైతు కన్వీనర్ ఫిరోజ్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

తరిగొప్పుల: తెలంగాణ రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగుతుందని, ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను సీఎం కేసీఆర్ నేడు అప్పుల రాష్ట్రంగా మార్చాడని బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభనబోయిన శివరాజ్ యాదవ్ అన్నారు. దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండ ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం మండలంలోని అబ్దుల్‌నాగారంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, జంగ వీరకుమార్, భాషబోయిన సుధాకర్, శ్రీకాంత్, సంపత్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సీపీఎంలో చేరుతున్న కార్యకర్తలు

జఫర్‌గఢ్: ప్రధాని నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి అబ్బాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో పార్టీ మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని పేర్కొన్నారు. బీజేపీని నిలువరించడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సీపీఎంలో చేరిక

మండలంలోని సాగరం, హిమ్మత్‌నగర్, జఫర్‌గఢ్ గ్రామాల నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి సీపీఎం పార్టీలో చేరారు. వీరికి అబ్బాస్ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఎండి శభాన, పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ యజమానుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కిష్టయ్య

జనగామ రూరల్: జిల్లాలో సెంట్రింగ్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని శ్రీ సాయి సెంట్రింగ్ ఓనర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఊడుగుల కిష్టయ్య కోరారు. ఈ మేరకు జిల్లాలో కేంద్రంలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ పెట్టుబడి పెట్టి సెంట్రింగ్ పనులు చేస్తున్నా గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సమస్యల పరిష్కారానికి రెండు రోజుల పాటు పనులు బంద్ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోళ్ల సిద్దులు, కల్లెపు కృష్ణ, ఎల్లయ్య, యాదగిరి, పర్వతాలు, శ్రీనివాస్, రాజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేటలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపైనుంచి కింద పడి మృతి చెందిన మోదెపు రాజు కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం బాధితకుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. గోపా అధ్యక్షుడు ఆంజనేయులు, శ్రీనివాస్, ప్రభాకర్, రాజసంపత్, భిక్షపతి, సంజీవులు, కిష్టయ్య, డానియల్ ఉన్నారు.

ప్రత్యేక పూజలు



దేవరుప్పుల: ఆయా సామాజిక వర్గాల్లోని పురాతన సంప్రదాయాలతోనే మానవ సత్ సంబంధాలు మెరుగుపడుతున్నాయని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోలుకొండలో శ్రీ దుర్గామాత, బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మండల కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీలు దామెర రమ స్వామి, మహమ్మద్ జాకీర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌టీపీ గ్రామ కమిటీ ఎన్నిక

తరిగొప్పుల: వైఎస్సార్‌టీపీ తరిగొప్పుల గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎర్రవెల్లి బాలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చింతల భాస్కర్, కోశాధికారిగా బూస నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ముట్టం మొగిలి, అన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కార్యదర్శులుగా సొంటెక్క వెంకటేశ్వర్లు, కంటె రాములు, కార్యవర్గ సభ్యులుగా మచ్చ చిన్న యాదయ్య, పోలబోయిన నాగభూషణం, లింగం, చక్రపాణి, రవీందర్, రమేష్, బండ ఆనందరం ఎన్నికయ్యారు. ఇందుర్తి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు రవి, అర్జుల అంజిరెడ్డి పాల్గొన్నారు.

చర్చి నూతన కమిటీ..

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల జెరోం మెమోరియల్ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గాన్ని ఆదివారం వరల్డ్ మినిస్ట్రీ డైరెక్టర్ ఎల్మార్ విక్టర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగ్గం ఆనంద్, కార్యదర్శిగా రాహుల్, కోశాధికారిగా కోండ్ర ప్రవీణ్, డైరెక్టర్లుగా నల్ల విల్సన్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరికుంట్ల డేవిడ్, సహాయ కార్యదర్శిగా జగ్గం అశోక్, కార్యవర్గ సభ్యులుగా కొండ్ర యోన, జగ్గం సమేల్, నల్ల అశోక్, ఆశీర్వాదం, సతీష్, ఎస్తపురం కృష్ణపాల్‌లను ఎన్నుకున్నారు.

‘హామీలపై మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలి’

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వస్తున్న మంత్రి కేటీఆర్ నియోజవర్గానికి ప్రభుత్వం గతంలో చేసిన హామీల విషయంలో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొలిపాక సతీష్ డిమాండ్ చేశారు. డివిజన్‌కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ గతంలో చేసిన హామీలపై స్పందించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో కోల శ్రీనివాస్‌గౌడ్, మధు, శేఖర్, ఏలియా, శ్రీనివాస్ పాల్గొన్నారు.